TELTEL/2022/83842

PRABHATA GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

శనివారం 11, ఏప్రిల్ 2026 | వరంగల్ | సంపుటి :04 | సంచిక :205 | పేజీలు :4 | వెల. 3/-



3

## భార్య, ఇద్దరు పిల్లల మృతి.. హత్యే

- పక్కా ప్రణాళికతో మర్డర్ చేసిన భర్త
- సంచలన కేసును ఛేదించిన వరంగల్ పోలీసులు
- 9 మంది అరెస్ట్, ఇద్దరు పరారీ

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన భార్య, ఇద్దరు బాలికల మృతి కేసును వరంగల్ పోలీసులు ఛేదించారు. ఈ ఘటన ప్రమాదవశాత్తు కాదని, పక్కా ప్రణాళికతో చేసిన హత్యలేనని పోలీసులు నిర్ధారించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు తన భార్య, ఇద్దరు కుమార్తెలను స్విమ్మింగ్ పూల్ లో ముంచి హత్య చేసినట్లు వెల్లడైంది. మూడో సంతానంగా మళ్లీ ఆడపిల్లే పుడుతుందనే అనుమానం, అలాగే మైనర్ బాలికతో ప్రేమ వ్యవహారం కారణంగా ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

- వరంగల్ క్రైం బ్యూరో, ప్రభాత గమనం

## అన్నా.. మీతో కలిసి పని చేయమని

# నన్ను దేవుడే పంపిండు..

- కేసీఆర్‌ను కలిసిన జీవన్ రెడ్డి భావోద్వేగం
- ఎర్రవెల్లి ఫాంహౌజ్ లో మాజీ ముఖ్యమంత్రితో భేటీ
- ఘన స్వాగతం పలికిన కేటీఆర్, పార్టీ ముఖ్య నేతలు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను మాజీ మంత్రి టీ. జీవన్ రెడ్డి శుక్రవారం ఎర్రవెల్లి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుష్పగుచ్ఛం అందించి సాదర స్వాగతం పలికారు. ఈ భేటీ సందర్భంగా మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్. రమణ, కోరుట్ల ఎమ్మెల్యే డా. సంజయ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కేసీఆర్‌ను కలిసిన సందర్భంగా జీవన్ రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. "తెలంగాణకు నష్టం జరుగుతున్న సమయంలో మీతో కలిసి పని చేయాల్సిన అవసరం ఉంది అన్నా... నన్ను దేవుడే మీ దగ్గరికి పంపిండు. చాలా గ్యాప్ తర్వాత మీతో కలిసి పనిచేసే అవకాశం రావడం ఆనందంగా ఉంది" అంటూ తన మనసులోని భావాలను వ్యక్తం చేశారు. జీవన్ రెడ్డి మాటలకు స్పందించిన కేసీఆర్ ఆయనను అప్యాయంగా ఆలింగనం చేసుకుని శాలువాతో సన్మానించారు. అనంతరం కాసేపు ఇష్టాగోష్టి నిర్వహించిన కేసీఆర్, జీవన్ రెడ్డి బృందాన్ని భోజనానికి ఆహ్వానించారు. ఈ భేటీతో బీఆర్ఎస్‌లో రాజకీయంగా కొత్త సమీకరణాలపై చర్చలు మొదలయ్యాయి.

— హైదరాబాద్, ప్రభాత గమనం



## ఎమర్జెన్సీ సేవలకు క్రిటికల్ కేర్ సెంటర్లు

- గ్రామీణ ప్రాంతాలకు అత్యాధునిక వైద్యం
- వైద్య విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తాం
- మంత్రి దామోదర రాజనర్సింహ



2

## అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- సెల్ టవర్ బ్యాటరీలు చోరీకి పాల్పడుతున్న నిందితులు
- ఐదుగురి అరెస్ట్, పరారీలో మరో ఇద్దరు
- 144 సెల్ టవర్ బ్యాటరీలు, రూ.2.60 లక్షల నగదు స్వాధీనం
- 2 ట్రాలీలు, 2 టూ వీలర్స్ సీజ్



2

## ఓరుగల్లులో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ మాఫియా

- గుట్టురట్టు చేసిన టాస్క్ ఫోర్స్ పోలీసులు
- ఆర్గనైజర్ తో సహా 11 మంది బెట్టింగ్ ప్లేయర్స్ అరెస్ట్



2

శనివారం
11.04.2026
www.prabhatagamanam.com
ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

# ఎమర్జెన్సీ సేవలకు క్రిటికల్ కేర్ సెంటర్లు


- గ్రామీణ ప్రాంతాలకు అత్యాధునిక వైద్యం
- వైద్య విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తాం
- మంత్రి దామోదర రాజనర్సింహ



నాగర్ కర్నూల్ బ్యూరో, ఏప్రిల్ 10 (ప్రభాత గమనం): మారుమూల గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎమర్జెన్సీ సమయంలో ప్రాణాలను కాపాడేందుకు రాష్ట్రవ్యాప్తంగా క్రిటికల్ కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల ఆవరణలో రూ.23.75 కోట్ల వ్యయంతో నిర్మించిన 50 పడకల అత్యాధునిక క్రిటికల్ కేర్ బ్లాక్‌ను మంత్రి ప్రారంభించారు. అలాగే తెలకపల్లి మండలంలో రూ.1.59 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు డాక్టర్ రాజేష్ రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు, గుండెపోటు, విషజ్వరాల వంటి అత్యవసర పరిస్థితుల్లో ఇకపై హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా జిల్లాలకే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల, ఆధునిక పరికరాల ఏర్పాటు వేగంగా కొనసాగుతున్నాయని, వైద్యులు, నర్సుల ఖాళీలను భర్తీ చేసేందుకు భారీ స్థాయిలో నియామకాలు చేపడుతున్నామని చెప్పారు. ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 43 వేల పడకల సామర్థ్యం అందుబాటులో ఉందని, అత్యవసర సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు అంబులెన్స్ సేవలను కూడా విస్తరిస్తున్నామని మంత్రి తెలిపారు. అలాగే రాష్ట్రంలోని 35 మెడికల్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు హాస్టల్ సౌకర్యాలు, ల్యాబ్‌లు, లైబ్రరీలు అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. వైద్య విద్యా ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ సందర్భంగా మెడికల్ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను విన్న మంత్రి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లా ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసి నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. కార్యక్రమంలో, నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర మున్సిపల్ వైస్ చైర్మన్ బాదాం రమేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, డీఎంహెచ్వో రవి నాయక్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ లోకి దళారులను అనుమతించొద్దు

- సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్



వరంగల్ బ్యూరో, ఏప్రిల్ 10 (ప్రభాత గమనం): స్టేషన్ ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్‌లో మొక్కజొన్న కొనుగోళ్లలో మధ్య దళారులను అనుమతించవద్దని సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్ అధికారులను కోరారు. శుక్రవారం మార్కెట్‌ను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ, ఇటీవల సీపీఎం బృందం పర్యటించి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన తరువాత కొనుగోళ్ల వేగం పెరిగిందన్నారు. అయితే ఫంగస్ పేరుతో రైతుల మొక్కజొన్నను పెద్ద ఎత్తున రిజెక్ట్ చేస్తున్నారని, దీనివల్ల మధ్య దళారులు మార్కెట్‌లోకి ప్రవేశించి తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. ఫంగస్ పేరుతో కొర్రీలు పెట్టి పంటను తిరస్కరించవద్దని కోరారు. అదేవిధంగా మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో అధికంగా మొక్కజొన్న పంట పండుతుందని, అక్కడి నుంచి మార్కెట్‌కు తరలించడం రైతులకు భారంగా మారుతోందన్నారు. అందువల్ల ఇప్పగూడెంలోనే ప్రత్యేక కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వ్యవసాయ మార్కెట్ చైర్మన్, కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, రైతు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.




## ఓరుగల్లులో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ మాఫియా

- గుట్టురట్టు చేసిన టాస్క్ ఫోర్స్ పోలీసులు
- ఆర్గనైజర్ తో సహ 11 మంది బెట్టింగ్ ప్లేయర్స్ అరెస్ట్
- రూ.లక్షా 6 వేల నగదు,12 స్మార్ట్ ఫోన్లు సీజ్

వరంగల్ బ్యూరో, ఏప్రిల్ 10 (ప్రభాత గమనం): ఓరుగల్లులో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ దందాను వరంగల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు బట్టబయలు చేశారు. హన్మకొండలోని గోపాల్‌పూర్ ప్రాంతంలో గుట్టుగా సాగుతున్న బెట్టింగ్‌పై పక్కా సమాచారం అందుకున్న పోలీసులు, టాస్క్ ఫోర్స్ ఏసీపీ ఎలిగేటి మధుసూదన్ పర్యవేక్షణలో దాడి చేశారు. ఇన్స్ పెక్టర్ సార్ల రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆపరేషన్‌లో నిర్వాహకుడితో పాటు 11 మంది బెట్టింగ్ ప్లేయర్లను అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.1.06 లక్షల నగదు, 12 స్మార్ట్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గోపాల్‌పూర్ వెంకటేశ్వర కాలనీకి చెందిన గట్ల రాజేష్ (34) 'Crick 666 Live' వెబ్‌సైట్ ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అరెస్టయిన వారిలో హన్మకొండ చింతగట్టుకు చెందిన గర్నపల్లి అరవింద్, ముప్పారపు రాజేంద్రప్రసాద్, పడమరకోటకు చెందిన చిట్ల రాజేష్, దేవర వినయ్, జెట్టబోయిన కుమార్, జనగామ జిల్లా చిల్పూర్ మండలం శ్రీపతిపల్లికి చెందిన వంగ శివకుమార్, బాషబోయిన శ్రీకాంత్, ఈర్ల విఘ్నేష్, స్టేషన్ ఘన్ పూర్ మండలం కొత్తపల్లికి చెందిన గంగుల అనిల్, బురు మధుకర్ , పింగిల్ల రవీందర్ ఉన్నారు.

## అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- సెల్ టవర్ బ్యాటరీలు చోరీకి పాల్పడుతున్న నిందితులు
- ఐదుగురి అరెస్ట్, పరారీలో మరో ఇద్దరు
- 144 సెల్ టవర్ బ్యాటరీలు, రూ.2.60 లక్షల నగదు స్వాధీనం
- 2 ట్రాలీలు, 2 టూ వీలర్స్ సీజ్
- వెల్లడించిన సీపీ సన్ ప్రీత్ సింగ్



వరంగల్ బ్యూరో, ప్రభాతగమనం, ఏప్రిల్ 10: శివారు ప్రాంతాల్లో సెల్ టవర్ల బ్యాటరీలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను వరంగల్ పోలీసులు అరెస్టు చేశారు. ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. పట్టుబడిన నిందితుల వద్ద నుంచి సుమారు రూ.1.98 లక్షల విలువైన 144 సెల్ టవర్ బ్యాటరీలు, రూ.2.60 లక్షల నగదు, రెండు ట్రాలీలు, రెండు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులంతా నల్గొండ జిల్లాకు చెందినవారిగా గుర్తించారు. నిందితులు కొంపల్లి గణేష్ (27), బొంగరాల సుధాకర్ (30), తన్నీరు శివాజీ (26), భీమనబోయిన నరసింహ (31), గడగోజు సురేష్ (25)లుగా గుర్తించారు. ఈ అరెస్టుకు సంబంధించిన వివరాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ శుక్రవారం మీడియాకు వెల్లడించారు. పోలీసులకు పట్టుబడిన నిందితుల్లో ప్రధాన నిందితుడైన గణేష్ (డ్రైవర్) మిగితా ఇద్దరు నిందితులైన సుధాకర్,శివాజీ లకు జనరేటర్ మరమ్మత్తులు, సెల్ టవర్ పనులకు పరిజ్ఞానం కలిగి ఉన్నారు. వీరంతా ముఠాగా ఏర్పడి, సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో సెల్ టవర్లలోని కొన్ని బ్యాటరీలను మాత్రమే తీసి చోరీలు చేసేవారు. టవర్ పని తీరుకు అంతరాయం కలగదని నిర్ధారించుకున్న తర్వాతే చోరీలకు పాల్పడటం వీరి ప్రత్యేకతగా పోలీసులు తెలిపారు. చోరీ చేసిన బ్యాటరీలను మహారాష్ట్రలోని గడ్చిరోలిలో విక్రయించి డబ్బు సంపాదించేవారు. అదేవిధంగా రాత్రి సమయంలో చెరువుల్లో చేపలు కూడా దొంగతనం చేసి, వాటిని నల్గొండ జిల్లాలో తక్కువ ధరలకు అమ్మేవారు. ఈ ముఠా వరంగల్, యాదాద్రి, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో మొత్తం 13 సెల్ టవర్లలో బ్యాటరీలు చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. గతనెల3న హసన్‌పర్తి పరిధిలోని అనంతసాగర్‌లో 48 బ్యాటరీలు చోరీ చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న హసన్ పర్తి పోలీసులు సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత అధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాపు చేపట్టారు. నిందితుల కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు పక్కా సమచారంతో శుక్రవారం తెల్లవారుజామున నిందితులు చోరీ సొత్తును అమ్మేందుకు హసన్‌పర్తి మండలం దేవన్నపేట గ్రామ శివారు ఓఆర్ఆర్ టోల్ గేట్ వద్ద వేచి వున్న ముఠాలోని ఐదుగురు సభ్యులను హసన్ పర్తి పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు ఇచ్చిన సమచారంతో పోలీసులు చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కబరిచిన సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డి, హసన్‌పర్తి ఇన్ స్పెక్టర్ చేరాలు, ఎస్సైలు దేవేందర్, సుజిత్ రెడ్డి, కానిస్టేబుళ్ళు క్రాంతి కుమార్, బావు సింగ్, వెంకట స్వామి, భరత్ తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బందిని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అభినందించారు.

# భార్య, ఇద్దరు పిల్లల మృతి.. హత్యే

- పక్కా ప్రణాళికతో మర్డర్ చేసిన భర్త
- సంచలన కేసును ఛేదించిన వరంగల్ పోలీసులు
- 9 మంది అరెస్ట్, ఇద్దరు పరారీ



వరంగల్, ఏప్రిల్ 10 (ప్రభాత గమనం):
రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన భార్య, ఇద్దరు బాలికల మృతి కేసును వరంగల్ పోలీసులు ఛేదించారు. ఈ ఘటన ప్రమాదవశాత్తు కాదని, పక్కా ప్రణాళికతో చేసిన హత్యలేనని పోలీసులు నిర్ధారించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు తన భార్య, ఇద్దరు కుమార్తెలను స్విమ్మింగ్ పూల్‌లో ముంచి హత్య చేసినట్లు వెల్లడైంది. మూడో సంతానంగా మళ్లీ ఆడపిల్లే పుడుతుందనే అనుమానం, అలాగే మైనర్ బాలికతో ప్రేమ వ్యవహారం కారణంగా ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ మీడియాకు వివరాలు వెల్లండించారు. ఐనవోలు మండలం పున్నేలు గ్రామానికి చెందిన మహ్మద్ అజారుద్దీన్ (29) తన భార్య ఫరహాత్, కుమార్తెలు హుమేరా (9), ఆయేషా (6)లను పక్కా ప్లాన్‌తో హత్య చేశాడు. ఐస్‌క్రీమ్ తినిపిస్తానని నమ్మించి వారిని తన స్విమ్మింగ్ పూల్ వద్దకు తీసుకెళ్లి, ముందుగానే సీసీ కెమెరాలు, విద్యుత్ నిలిపివేసి ముగ్గురినీ నీటిలోకి తోసి చంపాడు. అనంతరం ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు చిత్రీకరించేందుకు ప్రయత్నించాడు. దర్యాప్తులో భాగంగా నిందితుడు తన భార్యకు లింగ నిర్ధారణ పరీక్షలు చేయించి, గతంలో రెండు సార్లు గర్భస్రావం చేయించినట్లు బయటపడింది. అలాగే మైనర్ బాలికను వివాహం చేసుకోవాలనే ఉద్దేశంతో భార్య, పిల్లలను అడ్డంకిగా భావించి ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడితో పాటు అతని కుటుంబ సభ్యులు, సహకరించిన మరికొంతమందిని కలుపుకుని మొత్తం 9 మందిని పోలీసులు అరెస్టు చేశారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. ప్రత్యేక బృందాలు సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేసి నిందితుడిని పట్టుకున్నట్లు కమిషనర్ తెలిపారు. కేసును విజయవంతంగా ఛేదించిన పోలీస్ అధికారులను ఆయన అభినందించారు.

## బీటెక్ అడ్మిషన్ల పేరుతో ఘరానా మోసం

- 12 మంది విద్యార్థుల నుంచి రూ.14.81 లక్షలు వసూలు చేసిన మహిళ

వరంగల్ క్రైమ్ బ్యూరో (ప్రభాత గమనం):
హనుమకొండలో ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలల్లో బీటెక్ సీట్లు ఇప్పిస్తానని నమ్మించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మోసం చేసిన మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, కటకం స్వర్ణరాణి (39) అనే మహిళ 12 మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇప్పిస్తానని చెప్పి ఫీజుల పేరుతో మొత్తం రూ.14.81 లక్షలు వసూలు చేసింది. అడ్మిషన్ ఫీజు మాత్రమే కాలేజీలకు చెల్లించి, మిగిలిన మొత్తాన్ని కళాశాలలో చెల్లించకుండా తన వ్యక్తిగత అవసరాలకు వినియోగించింది. కాలేజీ నుంచి ఫీజు బకాయిల నోటీసులు రావడంతో మోసం వెలుగులోకి రావడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ సతీష్ దర్యాప్తు చేపట్టి నిందితురాలిని అరెస్ట్ చేశారు. నిందితురాలిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ అభినందించారు.

## పేకాట స్థావరంపై పోలీసుల మెరుపు దాడి

వరంగల్ క్రైమ్ బ్యూరో (ప్రభాత గమనం):
కాటారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గుమ్మల్లపల్లి ప్రాంతంలో పేకాట ఆడుతున్న వారిపై సీసీఎస్ పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. నిందితుల వద్ద నుంచి ఎనిమిది సెల్ ఫోన్లు, రెండు మోటార్ సైకిళ్లు, రూ.31,450 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

## ఘోర ప్రమాదం

- సీరోల్ శివారులో ఢీకొన్న బైక్ లు
- ఇద్దరి పరిస్థితి విషమం



సీరోల్, ఏప్రిల్ 10 (ప్రభాత గమనం):
మండల కేంద్రం శివారులో శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. స్థానికుల వివరాల ప్రకారం.. అతివేగంగా వస్తున్న స్కూటీ, మోటార్ సైకిల్ ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద ధాటికి వాహనాలు నుజ్జునుజ్జవ్వగా, వాటిపై ప్రయాణిస్తున్నవారు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయారు. ప్రమాద సమయంలో రెండు వాహనాలపై ముగ్గురేసి చొప్పున ప్రయాణించడం (ట్రిపుల్ రైడింగ్) ప్రమాద తీవ్రతను పెంచినట్లు స్థానికులు తెలిపారు. అతివేగం, అదుపు తప్పడమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా పోలీసులు భావిస్తున్నారు. స్థానికులు స్పందించి గాయపడిన వారిని మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## గంజాయి ముఠా గుట్టురట్టు

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- 5.84 కిలోల గంజాయి స్వాధీనం, రూ.2.92 లక్షల సొత్తు సీజ్




వరంగల్ క్రైమ్ బ్యూరో (ప్రభాత గమనం):
మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు 5.842 కిలోల ఎండు గంజాయి, ఒక స్కూటీ సహా రూ.2.92 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. రూరల్ సీఐ అంజలి తెలిపిన వివరాల ప్రకారం, శనిగపురం గ్రామ శివారులో వాహన తనిఖీల సమయంలో ఒకే స్కూటీపై వచ్చిన ముగ్గురు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా వెంటాడి పట్టుకున్నారు. నిందితులను బానోత్ ప్రశాంత్ (20), నూనావత్ రవీందర్ (19), మాలోత్ సందీప్ (19)గా గుర్తించారు. వీరికి కురవి మండలానికి చెందిన బానోత్ పవన్, గూగులోత్ వినోద్ గంజాయి సరఫరా చేసి, ఎక్కువ ధరకు అమ్మితే కమీషన్ ఇస్తామని ప్రలోభపెట్టినట్లు విచారణలో వెల్లడైంది. పట్టుబడిన నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## ఇసుక ట్రాక్టర్ సీజ్

వరంగల్ క్రైమ్ బ్యూరో (ప్రభాత గమనం):
సంగెం మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని చేసినట్లు ఎస్ఐ వంశీకృష్ణ తెలిపారు. కాశీకుంటకు చెందిన వ్యక్తి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో కుంటపల్లి సమీపంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వరంగల్ నుంచి సంగెం వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను గుర్తించి పట్టుకున్నారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## నక్కలగుట్ట చోరీ కేసులో నిందితురాలు అరెస్ట్

- 6 తులాల బంగారం స్వాధీనం

వరంగల్ క్రైమ్ బ్యూరో (ప్రభాత గమనం):
హనుమకొండ సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన దొంగతనం కేసును పోలీసులు ఛేదించి నిందితురాలిని అరెస్ట్ చేశారు. ఆమె వద్ద నుంచి సుమారు 6 తులాల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, సుబేదారి సీఐ రంజిత్ కుమార్ తన సిబ్బందితో నక్కలగుట్ట జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న మహిళను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. విచారణలో పెరుగు సుమశ్రీ (33) అక్టోబర్ 2024లో తన స్నేహితురాలి ఇంట్లోకి చొరబడి బీరువా తాళం పగులగొట్టి నగదు, బంగారం చోరీ చేసినట్లు ఒప్పుకుంది. నిందితురాలి వద్ద నుంచి నెక్లెస్, చెవి కమ్మలు, ఉంగరం, గొలుసు తదితర బంగారు నగలను స్వాధీనం చేసుకుని ఆమెను రిమాండ్‌కు తరలించారు.

## రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

గార్ల, ఏప్రిల్ 10 (ప్రభాత గమనం):
గార్ల రైల్వే స్టేషన్ పరిధిలో రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది. రైల్వే హెడ్ ఎస్ఐ సురేష్ వివరాల ప్రకారం, పట్టాలు దాటుతున్న సమయంలో వేగంగా వచ్చిన రైలు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతుడు మూగవాడై ఉండొచ్చని ప్రాథమిక సమాచారం వెల్లడిస్తోంది. అయితే మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లభించకపోవడంతో అతని వివరాలు తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఆత్మకూరు ఎస్సై సతీష్ పై సస్పెన్షన్ వేటు

- అవినీతి ఆరోపణలే కారణం
- విధుల్లో అలసత్వం, బాధ్యతరాహిత్యం

వరంగల్ బ్యూరో, ప్రభాతగమనం:
వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అవినీతి, అక్రమాలకు పాల్పడే అధికారులపై కఠిన చర్యలు కొనసాగుతున్నాయి. పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ క్రమశిక్షణలో భాగంగా ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న సతీష్‌ను సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అధికారుల విచారణలో ఎస్సై సతీష్‌పై అవినీతి ఆరోపణలతో పాటు విధుల్లో అలసత్వం, బాధ్యతారాహిత్యం ఉన్నట్లు నిర్ధారణ కావడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పలు కేసుల్లో నిర్లక్ష్యం వహించడం, బాధితులతో సానుకూలంగా వ్యవహరించకపోవడం వంటి ఆరోపణలు కూడా ఎదురయ్యాయి. ఇసుక అక్రమ రవాణా వ్యవహారాల్లో మితిమీరిన జోక్యం చేసుకున్నట్టు సతీష్‌పై ఆరోపణలు ఉన్నాయని సమాచారం. ఇదే సమయంలో అగ్రంపహాడ్ జాతర సందర్భంగా జరిగిన వివాదాల నేపథ్యంలో ఇదే స్టేషన్‌కు చెందిన మరో ఎస్సైపై కూడా ఇటీవల సస్పెన్షన్ వేటు పడిన విషయం తెలిసిందే.

# ఆయుష్ సేవలు వినియోగించుకోవాలి

## మహబూబాబాద్ కలెక్టర్ స్నేహ శబరీష్



మహబూబాబాద్, ఏప్రిల్ 10 (ప్రభాత గమనం): ఆయుర్వేద, హోమియోపతి, యునాని వైద్య సేవలను ప్రజలు విస్తృతంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. శుక్రవారం జిల్లా ప్రధాన ఆసుపత్రిలో నిర్వహించిన ఆయుష్ దినోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యమని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గురుకుల పాఠశాలలు, హాస్టళ్లలో ఉదయం యోగా శిక్షణ తరగతులు నిర్వహించామని, గ్రామస్థాయిలో ఆయుర్వేద, హోమియో, యునాని వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని చెప్పారు. హోమియోపతి వైద్య విధాన స్థాపకుడు డాక్టర్ శామ్యూల్ హనిమాన్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం హోమియోపతి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించి, ఆయుర్వేద మొక్కల ప్రదర్శనను పరిశీలించారు. తులసి, వేప, ఉసిరి వంటి ఔషధ మొక్కల ప్రయోజనాలపై వివరాలు తెలుసుకున్నారు. శిబిరంలో వైద్యులు ప్రజలను పరీక్షించి అవసరమైన సూచనలు అందించగా, మొత్తం 384 మంది సేవలు పొందారు. జిల్లాలో ఉన్న 10 ఆయుష్ డిస్పెన్సరీల ద్వారా ముందస్తు షెడ్యూల్ ప్రకారం సేవలు అందించాలని ఆమె ఆదేశించారు. జిల్లా కేంద్రం సహా ఇతర ప్రాంతాల్లో ఔషధ మొక్కల పెంపకానికి చర్యలు తీసుకోవాలని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ రవి రాథోడ్, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, ఆయుష్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- కొనుగోలు కేంద్రాల్లో పరిమితి పెంచాలి
- రైతులకు వెంటనే చెల్లింపులు చేయాలి
- ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు మర్రిపెల్లి మొగిలి



కేసముద్రం, ఏప్రిల్ 10 (ప్రభాత గమనం): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మొక్కజొన్న విక్రయించిన రైతులను తక్షణమే ఆదుకోవాలని ఎంసీపీఐ(యు) రాష్ట్ర కమిటీ సభ్యుడు మర్రిపెల్లి మొగిలి డిమాండ్ చేశారు. శుక్రవారం కేసముద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ఎకరాకు కేవలం 26½ క్వింటాళ్ల మొక్కజొన్న మాత్రమే కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది ఎకరాకు 35 నుంచి 45 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చినప్పటికీ, కొనుగోలు పరిమితి తక్కువగా ఉండడంతో మిగిలిన పంటను రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరలకు అమ్మాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు నష్టం తలెత్తకుండా ప్రభుత్వం కనీసం ఎకరాకు 40 క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అదేవిధంగా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంట విక్రయించిన రైతులకు ఇప్పటివరకు చెల్లింపులు జరగలేదని తెలిపారు. గత నెల 31న ప్రారంభమైన కేంద్రంలో సుమారు 400 మంది రైతులు మొక్కజొన్న విక్రయించినప్పటికీ, ఒక్క రూపాయి కూడా వారి ఖాతాల్లో జమ కాలేదని పేర్కొన్నారు. క్వింటాలుకు రూ.2400 ధర ఆశించి పంటను విక్రయించిన రైతులు చెల్లింపులు ఆలస్యమవ్వడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారని చెప్పారు. ప్రైవేటు వ్యాపారులు 15 రోజుల్లో చెల్లింపులు చేస్తున్న పరిస్థితిలో, ప్రభుత్వం కూడా ఆలస్యం చేయడం తగదని విమర్శించారు. మార్కెట్ నిబంధనల ప్రకారం సరుకు విక్రయించిన రోజే చెక్కు జారీ చేయాల్సి ఉండగా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కూడా అదే రోజు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని మొగిలి డిమాండ్ చేశారు.

# హాస్టల్ సందర్శన




కేసముద్రం ఏప్రిల్ 10(ప్రభాత గమనం): కేసముద్రం మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వసతి గృహాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత వెంకన్న, వైస్ చైర్ పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్ రావు, జిల్లా ట్రాన్స్ పోర్ట్ అథారిటీ మెంబర్ రావుల మురళి గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్లో విద్యార్థులు వసతి, ఆహార నాణ్యత, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. మెనూ తప్పకుండా అమలు చేయాలని హాస్టల్ వార్డెన్ కు సూచించారు.

# మేడ్చల్ సర్కిల్ లో కమిషనర్ పర్యటన



మేడ్చల్ బ్యూరో, ఏప్రిల్ 10 (ప్రభాత గమనం): మేడ్చల్ సర్కిల్ పరిధిలో పౌర సౌకర్యాల మెరుగుదలపై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. డిప్యూటీ కమిషనర్ సుధాంశ్‌తో పాటు ఇతర అధికారులతో కలిసి మౌలిక సదుపాయాలు, భూగర్భ మురుగునీటి వ్యవస్థ, చెరువుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపు పనులను వేగవంతం చేయాలని, టెండర్ ప్రక్రియ పూర్తయ్యాక వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. మురుగునీటి వ్యవస్థలో ఎక్కడా అడ్డంకులు లేకుండా చూడాలని, డ్రైనేజీ పూడికతీత పనులను గడువులో పూర్తి చేయాలని సూచించారు. మేడ్చల్ హైవే నుంచి అయోధ్య ఎక్స్ రోడ్స్ వరకు ఉన్న రహదారిపై గుంతలను తక్షణమే పూడ్చాలని, డ్రైనేజీ సమస్యల వల్ల నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రహదారుల పక్కన చెత్తను తొలగించి పరిశుభ్రత పాటించాలని అధికారులను ఆదేశించారు. యువత కోసం అవుట్‌డోర్ క్రీడా సదుపాయాలు, థీమ్ పార్కుల అభివృద్ధికి అనువైన స్థలాలను గుర్తించి ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# గార్ల మసీదు కమిటీ ఎన్నిక

## అధ్యక్షుడిగా షేక్ బుడన్ ఏకగ్రీవం



గార్ల, ఏప్రిల్ 10 (ప్రభాత గమనం): మండల కేంద్రంలోని మసీదు నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా షేక్ బుడన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు, పెద్దలు, యువత కలిసి షేక్ బుడన్‌ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం ఆయన మాట్లాడుతూ, తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



# పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించి చికిత్స అందించాలి

- జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. రవి రాథోడ్

మహబూబాబాద్, ఏప్రిల్ 10 (ప్రభాత గమనం): పిల్లలలో పుట్టుకతో వచ్చే లోపాలు, వ్యాధులను తొందరగా గుర్తించి వెంటనే వైద్య చికిత్స అందించడం అత్యంత ముఖ్యమని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. రవి రాథోడ్ అన్నారు. శుక్రవారం ఐడీఓసీలోని తన కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే), జిల్లా ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ కార్యక్రమాలపై సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్‌బీఎస్‌కే ద్వారా పిల్లలలో పుట్టుకతో వచ్చే లోపాలు, వ్యాధులు, పోషకాహార లోపాలు, అభివృద్ధి ఆలస్యాన్ని ముందుగానే గుర్తించి తక్షణ చికిత్స అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ల ద్వారా గుర్తించిన పిల్లలకు సమగ్ర వైద్య సేవలు, థెరపీ సేవలు సమయానికి అందించాలని సూచించారు. జిల్లాలోని అన్ని ఆర్‌బీఎస్‌కే బృందాలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శించి పిల్లల ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, గుర్తించిన కేసులను వెంటనే ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్లకు రిఫర్ చేయాలని ఆదేశించారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా ఎర్లీ ఇంటర్వెన్షన్ కేంద్రాలను మరింత బలోపేతం చేయాలని తెలిపారు. కార్యక్రమాల అమలులో ఉన్న పురోగతిని సమీక్షిస్తూ లోపాలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ప్రోగ్రాం అధికారి డా. లక్ష్మీనారాయణ, డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ కె.వి. రాజు, హెచ్‌ఈఓ కేఎల్ఎన్ స్వామి, ఆర్‌బీఎస్‌కే వైద్యులు, ఫార్మసిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# కుంటపల్లిలో పోలీస్ కళాజాత

వరంగల్ క్రైమ్ బ్యూరో (ప్రభాత గమనం): సంగెం మండలం కుంటపల్లి గ్రామంలో 'జాగృతి' పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాబృందం సభ్యులు పాటలు, నాటికల ద్వారా గంజాయి, డ్రగ్స్, గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని యువతకు సూచించారు. సైబర్ మోసాలు, బెట్టింగ్ యాప్‌ల వల్ల కలిగే నష్టాలను నాటికల ద్వారా వివరించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, రోడ్డు ప్రమాదాల నివారణ, వృద్ధుల సంరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ వంశీకృష్ణ, సర్పంచ్, పోలీసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# స్వాములకు అన్నదానం

కేసముద్రం ఏప్రిల్ 10(ప్రభాత గమనం): కేసముద్రం మున్సిపల్ 7వ వార్డు కౌన్సిలర్ రావుల వినయ్ రెడ్డి– మనిషా దంపతులు శుక్రవారం విలేజ్ లోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో హనుమాన్ స్వాములకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో హనుమాన్ మాలదారులు సదానందం, శ్యాంసుందర్, ఉప్పునూతల రమేష్, రామారావు, అశోక్, బానోత్ శంకర్ నాయక్, గుగులోతు రమేష్ తదితరులు ఉన్నారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374